

## హైడ్రాను రప్పించింది బీజేపీ, కాంగ్రెస్ నాయకులే: జోగు రామన్న

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

జిల్లాకు హైడ్రాను రప్పించింది బీజేపీ, కాంగ్రెస్ నాయకులేనని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. కూల్చివేతలకు కారణమైన వారే నేడు ఓట్లు అడుగుతున్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పాలని కోరారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రవీంద్రనగర్, తిర్పెల్లి, కొలిపుర, బ్రాహ్మణవాడ, ఇంద్రానగర్ కాలనీలలో బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేశారు. కాలనీవాసులు ఆయనకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వార్డుల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఆర్యవైశ్యులకు టికెట్లు ఇస్తానని చెప్పి బీజేపీ మోసం చేసిందని, సొంత పార్టీ నాయకులను కాదని టికెట్లు అమ్ముకుంటున్నారని విమర్శించారు. గత మిగతా 2లో..

# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 10, ఫిబ్రవరి 2026

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి

✪ నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికలలో ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కోరారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద జెండా ఊపి కలెక్టర్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ సాగిన ఈ ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని, ఇది ఓటరుకు వజ్రాయుధం లాంటిదని వివరించారు. ప్రతి ఎన్నికలోనూ ఓటర్లు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని మిగతా 2లో..



## నేడు ప్రలోభాల పర్వం

- బాబ్బాబు ఈ ఒక్కసారి నాకు ఓటెయ్యవా!
- చివరిగా ఓటు ఎలా అడగాలన్న సందిగ్ధంలో అభ్యర్థులు
- ఓటుకు నోటు ఫార్ములా అమలు చేస్తారా!
- ఫార్ములా అమలైతే ఓటు పిరమవుతుందా
- శివరాత్రికి ముందే జాగరణ చేస్తారా

**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

వారం రోజుల నుంచి చెన్నూరు మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ప్రచారాన్ని మంది,మార్బలంతో హోరెత్తించారు. నిన్నటితో ప్రచారం ముగియడంతో నేడు చివరిసారిగా ఓట్లు అడగడానికి తర్జన బర్జన పడుతున్నారు.వట్టి చేతులతో వెళ్లి ఓటు అభ్యర్థిస్తే ఓటు మనకు పడుతుందా అనే ఆలోచనలతో అభ్యర్థులు కొట్టుమిట్టాడుతున్నారు. నా పోటీదారుడు ఏమైనా ఆమ్యామ్యా ఆశ చూపిస్తాడా అనే సందేహంతో వ్యూహ రచనలు చేస్తున్నారు. హిస్తున్నారు. ఓటుకు నోటు ఫార్ములా అమలు చేస్తైనా కౌన్సిలర్‌గా గెలవాలన్న తాపత్రయంతో మరికొంతమంది ఉన్నట్లు సమాచారం. ఏదేమైనా ఓటర్లు ఎవరి మాట వింటారు, ఎవరికి ఓటు వేస్తారు, చూడాలి మరి.

## ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యతకు సంబంధిచిన గోడ ప్రతులను బ్యాంకు అధికారులు, జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జఆర్థిక అక్షరాస్యత వారంచ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర బ్యాంకులు ఖాతాదారులకు కె.వై.సి. ప్రాముఖ్యత, సి కె.వై.సి. వల్ల కలిగే ప్రయోజనాలు, కె.వై.సి. పేరుతో

మిగతా 2లో..



## సింగరేణి నిధుల లూటీని అడ్డుకోవాలంటే

# బీజేపీ అధికారంలోకి రావాలి

- ✳ మంచిర్యాల అభివృద్ధి స్మార్ట్‌సిటీ నిధులతోనే సాధ్యం
- ✳ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి
- ✳ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర మంత్రి ధ్వజం

**నస్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థను, తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సొమ్మును ఇష్టానుసారంగా వాడుకుంటూ కార్మికులను సమస్యల్లోకి నెట్టాయని విమర్శించారు. మంచిర్యాల మేయర్ పీఠాన్ని బీజేపీ కచ్చితంగా కైవసం చేసుకుంటుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో స్మార్ట్ సిటీ పథకం కింద మంచిర్యాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజలు మిగతా 2లో..

## హైడ్రాను రప్పించింది బీజేపీ, కాంగ్రెస్ నాయకులే: జోగు రామన్న

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం స్లాటర్ హౌస్ కోసం రూ. 50 లక్షలు మంజూరు చేస్తే, దాన్ని బంగారుగూడకు మార్చారని తెలిపారు. గతంలో కేఆర్కే కాలనీలో బుల్డోజర్లను అడ్డుకొని కూల్చివేతలను ఆపామని, ఇప్పుడు ఖానాపూర్‌లో హైడ్రా కూల్చివేతలకు ప్రయత్నిస్తే మళ్లీ బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటామని హెచ్చరించారు. జిల్లాకు హైడ్రాను తెచ్చిన నాయకులే ఇప్పుడు ప్రజల వ్యతిరేకత చూసి తప్పించుకు తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడప తిరుపతి, బట్టు సతీష్, స్వరూప రాణి, సౌజన్య, సాయి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. కళాజాత బృందాల ద్వారా వార్డుల వారీగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ప్రజలందరూ బ్యాంకింగ్ కేవైసీని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనివల్ల సైబర్ మోసాల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చని పేర్కొన్నారు. బ్యాంకింగ్ అధికారులు కేవైసీ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న, ఎక్సైజ్ అధికారి రజాక్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే నకిలీ ఫోన్ కాల్స్, మెసేజ్ లు, లింకుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అక్రమ నగదు లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలను వినియోగించకుండా ఉండటం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాంకులు తమ వెబ్ సైట్లు, ఎ టి ఎం స్క్రీన్ లు, శాఖలలో పోస్టర్ల ద్వారా ఈ సందేశాలను ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కె హరిత**

**- కాగజ్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్**

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటుహక్కు పాల్గొని ఓటు వినియోగించుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణం లో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ మార్చ్ లో ఎస్పీ నితిక పంత్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముగిసిందని, పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు సిబ్బంది నిమగ్నం అయ్యారని చెప్పారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ప్రలోభాలను అడ్డుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్‌కి ముందు, పోలింగ్ నాడు ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభావితం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి సమాచారం ఉన్నా స్థానిక ఎన్నికల అధికారులకు, కంట్రోల్ రూమ్ కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ నితిక పంత్ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల పోలింగ్ కి పకడ్బందీ నిఘా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఫ్లాగ్ మార్చ్ పట్టణం లోని పలు కూడళ్ల గుండా సాగింది. కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్, సీఐ లు ప్రేమ్ కుమార్, సంతోష్, కుమారస్వామి, ఎస్ఐ లు పాల్గొన్నారు.



### సింగరేణి నిధుల లూటీని అడ్డుకోవాలంటే

# బీజేపీ అధికారంలోకి రావాలి

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం అంటే మనకు మనమే అన్యాయం చేసుకోవడమేనని హెచ్చరించారు. కోవిడ్ విపత్తు సమయంలో పేదలకు ఉచితంగా ఐదు కిలోల బియ్యం అందించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా పేదల కోసం 12,000 కోట్ల టాయిలెట్లను నిర్మించి ఇచ్చామని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కార్మికులకు కొత్త క్వార్టర్లు నిర్మించకపోగా, ఉన్న క్వార్టర్లకు కనీస మరమ్మతులు కూడా చేయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో ప్రజలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సందర్భంగా నస్పూర్ తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లు రజిత మల్లేష్ దంపతులు కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, మేయర్ అభ్యర్థి ముఖేష్ గౌడ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా సేల్స్ ప్రారంభం

**- మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్**

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

ఆదివారం నుండి యూరియా సేల్స్ ఫర్టిలైజర్ బుకింగ్ అప్ ద్వారా మొదలయ్యాయి. ఇందు కొరకు రైతులు ప్లే స్టోర్ నుంచి యాప్ డౌన్లోడ్ చేసుకొని తమ యొక్క సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలు నమోదు చేసి బిల్లాలోని ఏ ఫర్టిలైజర్ దుకాణంలోనైనా యూరియా బుకింగ్ చేసి తీసుకోవచ్చు..రైతులు యూరియా బుకింగ్ చేసుకున్న తర్వాత ఫర్టిలైజర్ డీలర్ తమ యొక్క లాగిన్‌లో కన్ఫర్మ్ చేసి, రైతు యొక్క ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం నిర్ధారించుకొని యూరియా బ్యాగులు ఇవ్వడం జరుగుతుంది. బుకింగ్ చేసుకున్న తర్వాత రైతుకు 24 గంటల సమయం ఉంటుంది. డీలర్ వద్దకు వెళ్లి తీసుకోవడానికి కేవలం ఆదివారం రోజు మండలంలో రైతులు 460 బ్యాగులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకొని తీసుకోవడం జరిగింది. యాప్ పై ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మండల వ్యవసాయ అధికారిని రైతులు సంప్రదించవచ్చు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ వల్ల రైతులు జిల్లాలో ఏ డీలర్ వద్దనైనా స్లాట్ బుక్ చేసుకొని కొనుగోలు చేసుకోవడమే కాకుండా విడతల వారీగా రైతుకు వేసిన పంట ఆధారంగా ఎన్ని బ్యాగులు అని కాలిక్యులేట్ చేస్తుంది. అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని ప్యాక్స్ గుండ్లకోట నందు నిర్వహించడం జరిగిందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, విస్తరణ అధికారిని ఇర్ఫానా, రైతులు పాల్గొన్నారు.

## ఓటుతో మద్దతు ఇవ్వండి, వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తా: పొలం సత్యం

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**



క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 7వ వార్డు ఓటర్లు తమ ఓటుతో మద్దతు ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని 7వ వార్డు మాజీ కౌన్సిలర్ పొలం సత్యం అన్నారు. సోమవారం ప్రచారం చివరి రోజు క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో తనకు చేయూతనిచ్చి అత్యధిక మెజారిటీతో కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయి కుటీర్, దుబ్బపల్లి, క్యాతన్ పల్లి ఏరియాలలో ప్రచారం నిర్వహించారు. ఏడవ వార్డు ప్రజలు ఆదరించి గెలిపిస్తే రుణపడి ఉంటానని, మరొక అవకాశం ఇచ్చి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని మౌలిక వసతులు కల్పిస్తూ వార్డు అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తామని కౌన్సిలర్ అభ్యర్థి పొలం సత్యం ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు, ఇంటింటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, అందిస్తుందని, చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చేయూతనిచ్చిన చేతి గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**హాజీపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

మండల పరిధిలోని దొనబండ గ్రామంలో ఉన్న జడ్పీ ఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2005-2011 విద్యా సంవత్సరాల మధ్య పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు 15 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోమవారం రోజు అదే పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమ్మేళనం నిర్వహణకు ముందుగా పూర్వ విద్యార్థులందరి ఫోన్ నంబర్లను సేకరించి ప్రత్యేకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్ ద్వారా ప్రతి పూర్వ విద్యార్థిని సంప్రదించి కార్యక్రమానికి ఆహ్వానించడంతో, సంవత్సరాల అనంతరం మళ్లీ కలుసుకునే అరుదైన, అపూర్వమైన అవకాశం లభించింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస కాలానికి సంబంధించిన మధుర జ్ఞాపకాలను మనస్ఫూర్తిగా నెమరువేసుకున్నారు. పాఠశాల దశలో జరిగిన చిన్న చిన్న సంఘటనలు, చదువుల్లో నెలకొన్న ఆరోగ్యకరమైన పోటీ తత్వం, సహచరులతో గడిపిన అమూల్య క్షణాలను పరస్పరం పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తమ విద్యా జీవితానికి పునాదులు వేసిన అప్పటి గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురువుల ఆశీర్వచనాలు, సూచనలు ఈ కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చాయి. అనంతరం వివిధ కారణాల వల్ల మృతి చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మౌన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు.

## బాసర పుణ్యక్షేత్రానికి నేతాజీ పాఠశాల విద్యార్థుల విహారయాత్ర

**సారంగాపూర్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) నేతాజీ పాఠశాల విద్యార్థులు బాసరతో పాటు పరిసర ప్రాంతాల్లోని దేవాలయాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ప్రైవేట్ పాఠశాలలు కూడా విద్యార్థుల కోసం విజ్ఞాన, విహార యాత్రలు నిర్వహిస్తున్నాయి. యాత్రలో భాగంగా బాసర సరస్వతి అమ్మవారి ఆలయ విశిష్టతను, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ.. విజ్ఞాన యాత్రల వల్ల విద్యార్థుల్లోని అంతర్గత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. విద్యార్థులు ఏ రంగంలో రాణించగలరో గుర్తించడానికి ఇటువంటి యాత్రలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు



**సిరికొండ, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

సిరికొండ మండలం కుంటగూడ గ్రామానికి చెందిన పెందూరు బాపురావు (50) ద్విచక్ర వాహనంపై అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. బాపురావు ఇచ్చోడ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటి కాశీనాథ్, పైలట్ గోపీనాథ్ తెలిపారు.



## రిటైర్డ్ నౌకాదళ సైనికుడికి ఘన స్వాగతం

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

దేశ రక్షణే ధ్యేయంగా పదిహేను సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నౌకాదళ సైనికుడు బొమ్మిడి రాకేష్‌కు స్వగ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మైసమ్మ యూత్ సభ్యులు, యువకులు గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఆయనను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మైసమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాకేష్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. దేశం కోసం ఆయన చూపిన క్రమశిక్షణ, అంకితభావం ప్రతి యువకుడికి ఆదర్శమని గ్రామ పెద్దలు కొనియాడారు. దేశసేవలో పాల్గొన్న సైనికులంటే సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## టాలెంట్ టెస్టులతో పరీక్షల భయం దూరం: సెక్టోరల్ ఆఫీసర్ చౌదరి

### - నస్పూర్ శ్రీకృష్ణవేణి పాఠశాలలో యుఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

**నస్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

పదో తరగతి బోర్డు పరీక్షలు రాయబోయే విద్యార్థులకు యుఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగకరమని సెక్టోరల్ ఆఫీసర్ చౌదరి అన్నారు. నస్పూర్ మండలంలోని శ్రీకృష్ణవేణి హై స్కూల్‌లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ చౌదరితో పాటు మండల విద్యాశాఖ అధికారి పద్మజ, సెక్టోరల్ భరత్ పాల్గొన్నారు. పరీక్షల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభ బయటపడుతుందని చౌదరి పేర్కొన్నారు. ఒత్తిడిని జయించి మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని పద్మజ సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ టాలెంట్ టెస్ట్ సద్వినియోగం చేసుకుని మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5000 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి తెలిపారు. ప్రతి ఏటా విద్యార్థుల మేలు కోసం ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని పిలుపునిచ్చారు. బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఈ పరీక్ష పునాదిగా మారుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగల్ల ఉపేందర్, ట్రస్మా గౌరవ అధ్యక్షులు దేవన్న, కోశాధికారి కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. ఎంఆర్‌సీ దేవేంద్ర సింధు, ఎస్ఓ రాజకుమార్, యుఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మున్సిపల్ కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

### - ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియ కూడా అత్యంత కీలకమని, సిబ్బందికి ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ రోజున ప్రతి దశను వీడియో గ్రాఫీ చేస్తూ నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం డ్రా ద్వారా విజేతను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల కౌంటింగ్ కోసం 49 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో వార్డులో సుమారు 3 వేలకు పైగా ఓట్లు ఉండే అవకాశం ఉన్నందున, మూడు నుంచి నాలుగు రౌండ్లలో




లెక్కింపు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. సిబ్బంది ఫిబ్రవరి 12న జరిగే రెండో విడత శిక్షణకు, 13న కౌంటింగ్ రోజున నిర్దీత సమయానికి హాజరు కావాలని, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, నోడల్ అధికారులు మనోహర్, ఫణిందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## మహాదేవి వర్మ కవిత్వంపై విస్తృత ఉపన్యాసం

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ బాలుర నివాస డిగ్రీ కళాశాల(బోథ్)లో హిందీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల హిందీ సహాయ అధ్యాపకులు రాథోడ్ శ్రవణ్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఛాయావాద సాహిత్యంలో మహాదేవి వర్మ రచించిన 'వే ముస్కాతే ఫూల్ నహీ' కవితా పాఠ్యాంశంపై సుదీర్ఘంగా ఉపన్యసించారు. కవితలోని అంతరార్థాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శివకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హిందీ విభాగ విభాగాధిపతి పి. లక్ష్మీప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాసం అనంతరం ముఖ్య వక్త రాథోడ్ శ్రవణ్‌ను ప్రిన్సిపల్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు.




## ప్రజావాణికి 12 అర్జీలు

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి మొత్తం 12 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో 4 దరఖాస్తులు ఉచిత విద్యుత్ పథకం (గృహజ్యోతి)కి సంబంధించినవి కాగా, మిగిలిన 8 దరఖాస్తులు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుల కోసం వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పవార్ హీరాలాల్, వ్యవసాయ అధికారి మహ్మద్ సౌద్, విద్యాధికారి రాంకిషన్, వైద్యాధికారి డాక్టర్ భీమ్ రావ్, విద్యుత్ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ప్రజా సేవ చేసేందుకు అవకాశం ఇవ్వండి, అభివృద్ధి చేసి చూపిస్తా

### - 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం సంపత్ గౌడ్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**



మొదటి మున్సిపాలిటీ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి పోటీ చేసి, వార్డు అభివృద్ధికి కృషి చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానని బీజేపీ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం సంపత్ గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శివాజీ నగర్ ఏరియాలో ప్రచారం నిర్వహిస్తూ మరోసారి కౌన్సిలర్‌గా గెలిపిస్తే నిస్వార్థ సేవ చేస్తానని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తానని గడపగడపకు తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని 11వ వార్డు ప్రజలు, ఓటర్లను కోరుతున్నారు. రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇస్తూ, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, ప్రజలకు ఏ ఆపద వచ్చినా నిత్యం అందుబాటులో ఉంటానని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కౌన్సిలర్‌గా గెలిపిస్తే ప్రజా సేవ చేస్తా: మద్దెల

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి, ఆరవ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఆదరించి గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఒక్క అవకాశం ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపించాలని బిఆర్ఎస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థి మద్దెల శంకరయ్య భగత్ సింగ్ నగర్ ఎన్నికల ప్రచారంలో అన్నారు. రెండు పార్టీలు కలిసి మున్సిపాలిటీలో పోటీ చేస్తున్నాయని మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని వాడ వాడల, గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాలనీల్లోని రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఆరవ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చంద్రమౌళి, సిపిఐ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తీర్థయాత్రికుల కొరకు ప్రత్యేక రైళ్ళు..

**- ఐఆర్‌సిటిసి టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్**

నస్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

తీర్ధ యాత్రలకు వెళ్ళే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐ.ఆర్.సి.టి.సి టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి యం. కృష్ణమూర్తి, రైల్వే శాఖ అధికారులతో కలిసి రైల్ టూర్ ప్యాకేజెస్ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21, ఏప్రల్ 14 తేదీ లలో 2 ప్రత్యేక ప్యాకేజీలను భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్యాకేజీలో మార్చి 21వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు దివ్యదక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు) ఉంటుందని. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14 వేల 700 రూపాయలు, 3 ఎ.సి. ధర 22 వేల 300 రూపాయలు, 2 ఎ.సి. ధర 28 వేల 700 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొనసాగుతుందని తెలిపారు. 2వ ప్యాకేజీలో ఏప్రల్ 14వ తేదీన ప్రారంభమై 24 వ తేదీ వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర ఉజ్జయిని (మహాకాళేశ్వర్ ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమ్నాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గ్రీష్ణేశ్వర్) ఉంటుందని, ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 17 వేల 600 రూపాయలు, 3 ఎ.సి. ధర 26 వేల 700 రూపాయలు, 2 ఎ.సి. ధర 34 వేల 600 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి ;నిజామాబాద్ ధర్మాబాద్; ముద్ఖేడ్ హజూర్ సాహిబ్ నాందేడ్; పూర్ణ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ భీమా, రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు సమన్వయకర్తలు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకురుస్తారని, కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సి.సి. కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని, మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బి.ఆర్.ఎస్, సి.పి.ఐ అభ్యర్థుల విజయ కేతనం: బాల్క సుమన్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ సీపీఐ పార్టీ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు విజయం కేతనం ఎగురిస్తున్నారని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 1,2,4,7,8,10,12,17 వార్డులలో ప్రచార కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నడంతో కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారని ప్రచారం సైతం ఉత్సాహంగా చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో క్లీన్ స్లీప్ చేస్తామని తద్వారా చైర్మన్ పీఠం గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారీ జన సమీకరణ చేపట్టి గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు, కంకి కొడవలి గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పీఠంపై గులాబీ జెండా ఎర్ర జెండా కలిసి ఎగిరేలా ప్రజలంతా తీర్పునివ్వాలని బాల్క సుమన్ ఓటర్లను కోరారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కుమ్మరి కులస్తులను గెలిపించాలి

జన్నారం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కుమ్మరి కులస్తులను గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడూరు చంద్రయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరులు గత 78 ఏళ్లుగా మన తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా, ప్రత్యక్షంగా ఎన్నికల్లో గెలిచిన సందర్భాలు లేవని ఎందుకంటే కుమ్మరి కులస్తులలో భారీగా డబ్బు సంపాదించి కోట్ల రూపాయల ఖర్చు పెట్టే స్థితిలో లేనందున అసెంబ్లీ పార్లమెంటులో అడుగు పెట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్మరి కులస్తులే కాకుండా అనేక కులాల వారు ప్రజాప్రతినిధులుగా గెలిచి అసెంబ్లీ, పార్లమెంటులో అడుగుపెట్టని కులాల వారిని అన్ని కులాల వారు ఆదరించాలని రేపు జరగనున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

**- ఫర్టిలైజర్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించిన ఏఓ రామకృష్ణ**

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 9 , ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు పలు సూచనలు చేశారు. లైసెన్సులు తప్పకుండా షాపుల్లో ప్రదర్శించాలని, ఎరువుల డీలర్లు స్టాక్ నిల్వలను ఎప్పటికప్పుడు స్టాక్‌బోర్డుపై రాయాలని సూచించారు. దుకాణాల ముందు సూచిక బోర్డు తప్పనిసరిగా ఉంచాలని, సూచిక బోర్డుపై ఎరువుల ధరలు రాయాలని, రైతులకు సరైన ధరలకు అమ్మాలని, ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటిప్పుడు అప్డేట్ చేయాలని అన్నారు. అనంతరం తనిఖీ చేసే సమయంలో అక్కడ ఉన్న రైతులకి, డీలర్లకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్‌లో యూరియా బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పట్టా పాస్ బుక్ కి లింక్ ఉన్న మొబైల్ నెంబర్ ద్వారానే యూరియా బుకింగ్ యాప్లో మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి ఓటిపి ద్వారా లాగిన్ అయి యూరియా బుకింగ్ తీసుకోవాలన్నారు. బుకింగ్ చేసుకున్న ఎరువుల దుకాణం నుండి యూరియా బస్తాలను పొందాలని సూచించారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై ఎలాంటి సందేహాలు ఉన్న ఏఓ,ఏఈఓలను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని అన్నారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారానే అమలు జరుగుతుందని తెలిపారు. మంగళవారం ప్రతి రైతు వేదికలలో ఫర్టిలైజర్ యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రైతులందరూ ఫర్టిలైజర్ యాపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు.



ఫర్టిలైజర్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రామకృష్ణ



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ రవికుమార్

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన

తాండూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :

మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ చందనాల రవి కుమార్ ముఖ్య అతిథి హాజరై చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్లు తిరుమలేశ్వరి, సువర్ణ, లక్ష్మి. ఆయాలు, పిల్లలు, పేరెంట్స్ పాల్గొన్నారు.

### చిన్నారులకు అక్షరాభ్యాసం..

మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలోని అంగన్వాడి ఐదో కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారిశెట్టి స్రవంతి ముఖ్యఅతిథి హాజరై చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులను సూపర్వైజర్, అంగన్వాడి టీచర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి బండి పోషం, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూపారాణి, అంగన్వాడీ టీచర్లు గోపమ్మ, మల్లుబాయి జ్యోతి, కౌసల్య, అర్చన, సునీత, అమృత, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న సర్పంచ్ మారిశెట్టి స్రవంతి

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

హాజీపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

మంచిర్యాల కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు త్వరితగతిన అందుతాయని అన్నారు. ప్రజాసంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. సోమవారం రోజు 15 వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతపండు. శ్రీనివాస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు



## వార్డు నెంబర్ 2 అభ్యర్థిని గెలిపించాలి: ఎంపీ గోడం నగేష్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ సోమవారం పట్టణంలోని 2వ వార్డు (రణదివే నగర్) లో పర్యటించారు. బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి కారం సాయికృష్ణను గెలిపించాలని కోరుతూ ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ.. గత అనేక ఏళ్లుగా గెలిచిన వారు వార్డులను నిరక్ష్యం చేశారని విమర్శించారు. సాయికృష్ణను గెలిపిస్తే వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా మేళతాళాలతో వార్డుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాటిపల్లి గంగాధర్ రావు, రాష్ట్ర నాయకులు ముస్తాపురే అశోక్, మాజీ కౌన్సిలర్ వాగ్మరే శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతు వేదికలో పంటల నమోదు

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ గ్రామ రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు యాసంగి పంటల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు బజార్‌హత్నూర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. బజార్‌హత్నూర్, బండ్రైవ్, బలాన్‌పూర్, కొల్హారి గ్రామాల రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఈ సందర్భంగా నమోదు చేసుకోవాలని, రైతులు తమ వెంట పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకువచ్చి, పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చెందాలి

### - లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్ ప్రజా సమస్యలపై విస్తృత చర్చ గ్రామసభకు విశేష స్పందన

**లింగాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ప్రజలు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం అంశాలపై ఈ గ్రామసభలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ గ్రామసభకు అటవీ శాఖ, రెవిన్యూ శాఖ, ఆరోగ్య శాఖ, విద్యాశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత అధికారులు వాటిపై స్పందిస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అటవీ హక్కులు, భూముల సమస్యలు, ఆరోగ్య సేవలు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల అంశాలపై గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తారు. అధికారులు ప్రభుత్వ పథకాల వివరాలను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, సమస్యల పరిష్కారంలో అధికారులు–ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామసభలో ప్రజల చురుకైన పాల్గొనడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ జాదవ్ రాజశేఖర్

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

### - కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**




అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోని, జిల్లాలో వంద పోలింగ్ శాతం నమోదుకు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మాజీ సైనికుల సంఘాల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, సమాజంలోని అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ఓటు వేసేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహనపై తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం ప్రదర్శించిన ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరితో ఓటు హక్కు వినియోగిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ రాజు, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, వయోవృద్ధులు, దివ్యాంగులు, మాజీ సైనికులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి: సర్పంచ్ కావేరి

**నార్నూర్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:**

ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బాణోత్ కావేరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని జీవితంలో మరింత ఎదగాలని సూచించారు. కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీఓ పుల్లారావు, ఎస్సై శ్రీసాయి, పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఓదెలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కన్వేయర్ బెల్ట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ తిరుమలరావు

## బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పర్యటన

**తాండూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియాలో సోమవారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమలరావు పర్యటించారు. కైరిగూడ ఓసీలో పిట్ క్రషర్ కన్వేయర్ బెల్ట్ ను బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర్ రెడ్డితో కలిసి డైరెక్టర్ ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ రవాణా వేగవంతం అవుతుందని, వాహనాల వినియోగం, చమురు వాడకం తగ్గనుందన్నారు. కైరిగూడ ఓసి ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తుందన్నారు. కార్యక్రమంలో కైరిగూడ పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ ఓ టు జి ఎం రాజమల్లు, గోలేటి ఓసి పిఓ ఉమాకాంత్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

రైతులు యూరియా అప్ పై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ మిలింద్ పెర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో యూరియా యాజప్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు యూరియా కోసం తిరగకుండా ఇంట్లో నుంచే ఆప్ ద్వారా బుక్ చేసుకొచ్చని తెలిపారు. ఈ ఆప్ ద్వారా రైతులకు ఉపయోగపడే సమాచారం ఉందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ డీలర్ ఆశిష్, రైతులు పాల్గొన్నారు.



యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మిలింద్

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**కాగజ్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడలో ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు ఆరెగూడ గ్రామానికి చెందిన చౌదరి రవీందర్ సోమవారం పరీక్ష సామాగ్రి పంపిణి చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గురుకుల ప్రవేశ పరీక్ష రాస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, కంపాస్లను పంపిణి చేశారు. విద్యార్థులందరూ గురుకులలో సీటు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్ము లక్ష్మీనారాయణ, సిఆర్‌పి తుకారాం, పాఠశాల ఉపాధ్యాయులు జిత్తు నాయక్, రౌతు రవి పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేసిన చౌదరి రవీందర్

### ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల్లో

# పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

2వ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని డి.ఎ.వి. పాఠశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికలలో భాగంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి, సామాగ్రి పంపిణీ సిబ్బందికి భోజన వసతులు, ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ లో సి సి కెమెరాలు, బందోబస్తు కల్పించాలని, ఈ నెల 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సిసి కెమెరాలు, వీడియోగ్రఫీ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసిల్దార్ మధుకర్, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ కె. హరిత




## మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు

**కెరిమెరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

కెరమెరి మండలం పరిందోలి గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన అదే ధన్ లాల్, రాథోడ్ ప్రహ్లాద్ అనే ఇద్దరు ప్లాట్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించడంతో కెరమెరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కెరమెరి ఎస్సై మధుకర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ అజయ్ ఉల్లం నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. మండలంలో ఎవరైనా మహిళల పట్ల అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఎమ్మెల్యే చొరవతో త్రాగునీటి సమస్య పరిష్కారం

**బెల్లంపల్లి రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

లింగాపూర్ గ్రామంలో ఉన్న త్రాగునీటి సమస్యలను తీర్చాలని స్థానిక సర్పంచ్ తోంగల నర్మద శ్రీనివాస్ గడ్డం వినోద్ వెంకటస్వామి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కారుకురి రాంచందర్ దృష్టికి తీసుకువెళ్ళడంతో వెంటనే స్పందించి సోమవారం లింగాపూర్ గ్రామానికి బోర్వెల్ వాహనాన్ని పంపించి బోర్ వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ పాల్గొని కొబ్బరి కాయ కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి అలాగే రాంచందర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగంశెట్టి క్రిష్టయ్య నాయకులు సింగతి రామకృష్ణ, అజ్మీరా శంకర్, రాగంశెట్టి కుమారస్వామి, రెంక రాజేశం, అజ్మీరా శ్రీనివాస్, బానోత్ మోతీలాల్, అజ్మీరా శివరాం, నల్లపు తిరుపతి మహిళలు పాల్గొన్నారు.

## IIన మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సెలవు

**- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.హరిత**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం ఉపయోగించే అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థలు, ఇతర భవనాలకు ఈ నెల 10, 11 తేదీలలో స్థానిక సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేసిన సంస్థలకు ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు నోటిఫై చేయబడిన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగులు వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా స్థానిక సెలవు ప్రకటించడం తెలిపారు.


ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న ఏఎస్పీ చిత్తరంజన్, ఎస్హెచ్ఓ బాలాజీవరప్రసాద్

## ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఎస్పీ చిత్తరంజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ పట్టణంలో శాంతిభద్రతల కోసం సుమారు 100 మంది పోలీస్ సిబ్బందితో ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించిన్నట్లు తెలిపారు. ఓటర్లు భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏఎస్పీ సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉంటాయని, సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ ఎస్సై ఉదయ్ కిరణ్, ప్రత్యేక పోలీస్ బలగాలు పాల్గొన్నారు.



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఏఓ ప్రేమలత

## గిరిజన విద్యార్థినిలు మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

గిరిజన విద్యార్థినులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధిచిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థినులు ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా డిగ్రీ ప్రవేశాల కొరకు సకాలంలో దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.శారద, వైస్ ప్రిన్సిపల్, ఐ.క్యు.ఎ.సి. సమన్వయకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌పై ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన సదస్సు

**కౌటాల, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**

కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం యూరియా బుకింగ్ యాప్ పై మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన సదస్సును జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి యూరియా బుకింగ్ యాప్‌లో రైతులు యూరియా ఎలా బుక్ చేసుకోవాలో డీలర్లకు వివరించారు. రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ పూర్తి చేసిన అనంతరం వారికి ఒక బుకింగ్ ఐడీ నెంబర్ అందుతుందని తెలిపారు.రైతులు తమకు అందుబాటులో ఉన్న షాపుల్లో డివిజన్ పరిధిలోని ఏ మండలంలోనైనా యూరియా బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. కౌలు రైతులకు కూడా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని, పట్టా లేని భూములకు సంబంధించి పంట నమోదు చేసిన రైతులకు కూడా యూరియా బుకింగ్ సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రేమలత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా యూరియా బుకింగ్ విధానాన్ని డీలర్లకు వివరించారు.యూరియా తీసుకునే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ వెంట బుకింగ్ ఐడి నెంబర్, ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్ తీసుకెల్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అంజన్న, ఘన్ శ్యామ్, రాజేశ్వర్,కవిత, రష్మిత, ప్రాథమిక సహకార సంఘం సీఈఓ రాజేష్ తో పాటు మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

## పాఠశాలలో షీటీం అవగహన కార్యక్రమం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

మండలంలోని చెడ్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రతపై షీటీం ఆధ్వర్యంలో సోమవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నిచత పంత్ ఆదేశాలమేరకు జరిగిన ఈ కార్యక్రమంలో షీటీం ఇంచార్జ్ ఏఎస్సై సునీత మాట్లాడుతూ మహిళల భద్రతా చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన డయల్ 100 వినియోగం, సామాజిక మధ్యమాల్లో జాగ్రత్తలు, ఈవ్ టిజింగ్, సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగహన కల్పించారు. వేధింపులు ఎదురైతే వెంటనే కాఘజ్ నగర్ షీటీం నెంబర్ 8712670565కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమేష్ బాబు, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు పాల్గొన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఎస్సై సునీత

# అలుగు పొలుసుల అక్రమ వ్యాపారం బట్టబయలు

## - ల్యాబ్ రిపోర్ట్‌తో తేలిన నిజం... ఆరుగురు అరెస్ట్

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం ఎల్కపల్లి గ్రామంలో అక్రమంగా అటవీ జంతువుల అవయవాలతో ఆయుర్వేదిక్ మందుల పేరిట వ్యాపారం సాగిస్తున్న ముఠాను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. అనుమానస్పదంగా సంచారిస్తున్న ఆరుగురు వ్యక్తులపై తనిఖీలు నిర్వహించగా, వారి వద్ద పులి గోర్లు, పులి వెంట్రుకలు, అలుగు ( ఇండియన్ పాంగోలిన్ ) పొలుసులు సహా అటవీ జంతువులకు సంబంధించిన కీలక అవయవాలు బయటపడ్డాయి. ఈ ఘటన గత డిసెంబర్ లో చోటుచేసుకోగా , ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ మార్గదర్శకత్వంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్ లో ఫారెస్ట్ సెక్షన్ అధికారి జగన్ మోహన్, ఫారెస్ట్ బీట్ అధికారి సతీష్ డ్రైవర్ వాజీద్, అనిమల్ ట్రాకర్ రాజులు కీలకంగా వ్యవహరించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను అధికారులు నాగపూర్ లోని వైల్డ్ లైఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఫిబ్రవరి 6వ తేదీన అందిన ల్యాబ్ నివేదిక ప్రకారం, కొండేటి వెంకటేష్ తండ్రి స్వామి, ఇంగ్లె రాజన్న తండ్రి ఉకందారావు వద్ద లభించిన అలుగు పొలుసులు నిజమైనవేనని నిర్ధారణ అయింది. దీంతో అటవీ చట్టం, వన్యప్రాణుల రక్షణ చట్టం 1972 ప్రకారం కేసులు నమోదు చేశారు. అనంతరం సిర్పూర్ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లుగా ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలతో మోసపూరిత మాటలకు ప్రజలు లొంగవద్దని, అటవీ జంతువులను హతమార్చడం, వాటి అవయవాల కొనుగోలు, అమ్మకాలు చేయడం తీవ్రమైన నేరమన్నారు, అరుదైన వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.



క్రీడాకారులకు డ్రెస్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఎంజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ

**తిర్యాని, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**

సీఎం కప్‌లో క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఎంపిక అయిన తిర్యాని మండలానికి చెందిన క్రీడాకారులకు సోమవారం ఎంజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్ లను పంపించేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మాజీ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మడావి గుణవంతురావు మాట్లాడుతూ. క్రీడాకారులను ప్రోత్స హించడంలో తమ ఫౌండేషన్ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. తమకు క్రీడలపై ఉన్న మక్కువతో పాటు క్రీడాకారులను ప్రోత్స హించాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిర్యాని ఏఎస్సై నారాయణ, పిడిలు కుర్సెంగ శ్రీనివాస్, పెందోర్ సుభాష్ ఎంజీఆర్ యువ సైన్యం అధ్యక్షులు కుడ్మేత అర్జున్, నాగరాజ్, చిక్రం జంగు, మడావి రాజేందర్, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా బుకింగ్ యాప్ ద్వారానే అమలు

### - వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజానరేంద్ర

**తాండూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

యూరియా బుకింగ్ యాప్ ద్వారానే అమలు జరుగుతుందని వ్యవసాయ శాఖ బెల్లంపల్లి సహాయ సంచాలకులు రాజ నరేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని ఐబీలో గల ఎరువుల దుకాణాన్ని సోమవారం ఆయన తనిఖీ చేసి యూరియా బుకింగ్ అప్ గురించి రైతులకు అవగాహనా కల్పించారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ లో యూరియా బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పట్టా పాస్ బుక్ కి లింక్ ఉన్న మొబైల్ నెంబర్ ద్వారానే యూరియా బుకింగ్ యాప్లో మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి ఓటిపి ద్వారా లాగిన్ అయి యూరియా బుకింగ్ తీసుకోవాలన్నారు. బుకింగ్ చేసుకున్న ఎరువుల దుకాణం నుండి యూరియా బస్తాలను పొందాలని సూచించారు. యూరియా బుకింగ్ యాప్ లో సందేహాలను నివృత్తి చేసేందుకు మండల వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, అందుబాటులో ఉంటారని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో సుష్మ, ఏఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.


ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత

## కౌంటింగ్ కేంద్రంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాలులో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించే సిబ్బంది ప్రశాంతంగా తమ ఓటును వినియోగించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, తహసిల్దార్ రియాజ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుమారుడి మరణంతో మనోవేదన.. తల్లి ఆత్మహత్య

### - తుమ్మగూడ గ్రామంలో విషాద ఘటన

**కెరమెరి, జనవరి 9, ప్రభాతవార్త:**

మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన చవాన్ అరవింద్(35) ఆరు నెలల క్రితం మృతి చెందగా, ఆ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన అతని తల్లి చవాన్ సుమిత్ర భాయ్ (60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మానసిక వేదనకు లోనైన సుమిత్ర భాయ్, సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి, మరణించారు. ఈ ఘటనపై మృతురాలి భర్త గోవిందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కెరమెరి ఎస్సై మధుకర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

## మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కే హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ సముదాయ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెండో సాదారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11న ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటిలో జరిగే పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందిని మూడో ర్యాండమైజేషన్ పక్రియ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత మున్సిపల్ ఎన్నికల సాదారణ పరిశీలకులు అలోక్ కుమార్ ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికార లోకేశ్వర్ రావు తో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్బగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటిలో 20 వార్డులకు 28 పోలింగ్ కేంద్రాలు, రిజర్వ్యుటీంతో కలిపి 35 టీంలను కేటాయించడం జరిగిందని, కాగజ్ నగర్ మున్సిపాలిటిలో 30 వార్డులకు 85 పోలింగ్ కేంద్రాలు, రిజర్వ్యుటీంతో కలిపి 102 టీంలను కేటాయించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపడుతున్నమన్నారు. ఈ కార్యక్రమములో ఎన్ఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత

## ఉత్తమ ప్రతిభ కనబరిచి పీహెచ్‌డి పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్న కలమడుగు వాసి

**జన్నారం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**




జన్నారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ దంపతుల కుమారుడు బొంతల మధుకర్ హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డి పూర్తి చేసి పట్టా, అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ వి. రాములు మార్గదర్శకత్వంలో రబీ, మొక్కజొన్న పంటకు వివిధ నీటి పారుదల పద్ధతులు, కలుపు నియంత్రణ, డ్రోన్‌తో మందులు ఎలా పిచికారి చేయాలో లోతుగా అధ్యయనం చేశారు. హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో టాటా కార్నెల్ ఇన్సిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ యూఎస్ఏ కార్నెల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రభు ఎల్ పింగళి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యల చేతుల మీదుగా పీహెచ్‌డి పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



32వ డివిజన్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

# మంచిర్యాల స్థాయిలో నస్పూర్ అభివృద్ధి: కొక్కిరాల సురేఖ

## 32వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ధర్ని మధుకర్ గెలుపునకు పిలుపు

నస్పూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

మంచిర్యాల నగరంతో సమానంగా నస్పూర్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్ పరిధిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ధర్ని మధుకర్ చేయి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో వేసవి కాలం వస్తే నస్పూర్ ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదని గుర్తు చేశారు. అప్పట్లో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేసేవారమని వివరించారు. ప్రేమ్ సాగర్ రావు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇక్కడ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన అవసరం లేకుండా మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని చెప్పారు. మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కృషి చేస్తున్నారని సురేఖ పేర్కొన్నారు. నస్పూర్ మండల విద్యార్థుల కోసం త్వరలోనే ఇంజనీరింగ్ కాలేజ్ అందుబాటులోకి రాబోతుందని వెల్లడించారు. అభివృద్ధి పథంలో నస్పూర్ దూసుకుపోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధ అభివృద్దే లక్ష్యం: ఎంపిడిఓ ఆల్బర్ట్

## - ఉపాధి, ఇందిరమ్మ, నర్సరీల తనిఖీ

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త

మండలంలోని చెడ్వాయి, బొంబాయిగూడ గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఎంపిడిఓ ఆల్బర్ట్ సోమవారం పరిశీలించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, పనుల నాణ్యతతో పాటు హాజరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలిపారు. కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే ప్రతి కూలీకి రోజుకు రూ 307 వేతనం అందుతుందని కూలీలకు వివరించారు. అనంతరం కొండపల్లి, లోడుపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. విత్తనాలు త్వరితగతిన బెడ్స్ లలో విత్తి సమృద్ధిగా నీరు అందించి మొలకలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, శ్రీకాంత్, జయశ్రీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




# చికిత్స పొందుతూ యువకుడు మృతి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



లక్షెట్టిపేట మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన నాతరి ప్రశాంత్ అనే 30 సంవత్సరాల యువకుడు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మృతుని తల్లి ఒక బ్యాంకులో మరి కొంతమందితో కలిసి గ్రూప్ లోను తీసుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో గ్రూప్‌లో డబ్బులు చెల్లించాల్సి ఉండగా, మృతుని తల్లి గ్రూప్ సభ్యురాలు అయిన కొండ సువర్ణకు చెల్లించింది. డబ్బులు చెల్లించిన తర్వాత కూడా మీ అమ్మ గ్రూప్ డబ్బులు చెల్లించాలని చెప్పగా మృతుడు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఇద్దరు చెల్లించడంతో మృతుడు ఒకరి డబ్బులు ఇవ్వాలని అక్కడే ఉన్న మరో సభ్యురాలు దాసరి సంధ్య నువ్వేంది డబ్బులు అడిగేది అని మృతుని పైకి గొడవకు దిగింది. అక్కడే ఉన్న వాళ్ళ బంధువులు బైరం కృపాకర్, బైరం దినాకర్ అనువారు కర్రలతో దాడి చేయగా చుట్టుపక్కల వారు ఆపి ఇంటికి పంపించారు. అదే రోజు మృతుడు పని నిమిత్తం ఇంటి నుండి బయటకు రాగా అప్పటికే బయట కాపు కాస్తున్న దాసరి సురేష్, బైరం దినకర్, బైరం కృపాకర్, దాసరి సంధ్య అనే నలుగురు మృతునిపై దాడి దాడి చేయగా కిందపడిపోవడంతో స్థానికులు గమనించి లక్షెట్టిపేట ప్రభుత్వ చికిత్స నిమిత్తం తరలించారు. ఆ గొడవ జరిగినప్పటి నుండి మృతుడు విషయాన్ని మనసులో పెట్టుకొని ఎప్పుడు బాధ పడుతూ ఉండేవాడు. అదే క్రమంలో నిన్న (గొడవ జరిగిన 2నెలల 6రోజుల తర్వాత) మృతుడు ఇంట్లో బాధపడుతూ అస్వస్థతకు గురి అయి కళ్ళు తిరిగి కింద పడిపోగా కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం సీరియస్‌గా ఉండటంతో స్థానిక సాయి సంజీవని ఆసుపత్రికి, అక్కడి నుండి మంచిర్యాల ఆస్పత్రికి అక్కడ వైద్యుల సూచన మేరకు ప్రతిమ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స కోసం చేర్పించారు. ప్రతిమ ఆస్పత్రిలో మృతుని కండిషన్ సీరియస్ గా ఉందని బ్లడ్ క్లాట్ అయిందని వైద్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయగా, ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యుల పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుడు రెండు నెలల క్రితం పైన తెలిపిన నలుగురు కొట్టడం వల్లే బ్లడ్ క్లాట్ అయి చనిపోయినట్లు అనుమానం ఉందని మృతుని తల్లి నాతరి భాగ్య ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆశీర్వదించండి, గెలిచి అభివృద్ధి చేసి చూపిస్తా..

## - 14వ స్వతంత్ర వార్డు అభ్యర్థి చింత అశోక్ కుమార్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త



చివరి రోజు ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చింత అశోక్ కుమార్

మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించి అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని లక్షెట్టిపేట 14వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి చింత అశోక్ కుమార్ కోరారు. సోమవారం చివరి రోజు ప్రచారంలో భాగంగా ఆయన 14వ వార్డులో కార్యకర్తలతో పాటు ఇంటింటికీ తిరుగుతూ డప్పు చప్పుళ్లతో, నృత్యాలతో హోరా హోరీగా విజయం తనదే అంటూ ప్రచారం నిర్వహించారు. నేను మొదటిసారిగా గెలిచి చేసిన అభివృద్ధిని ఓటర్లకు తెలుపుతూ ప్రచారం నిర్వహించారు. తనపై నమ్మకంతో వార్డు అభివృద్ధికి వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇచ్చారని, ఈసారి మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈనె ల 11వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రవీందర్, మంద సుగుణాకర్, ఇమ్రాన్, సాజిద్, రమేష్, కుమార్ వేణు పెద్ద ఎత్తున వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




చివరి రోజు ప్రచారంలో డప్పు చప్పులతో నృత్యం